# ఎండాకాలంలోనూ 'బురద' కష్టాలా?

## హరిప్రియ నగర్‌లో వాహనదారుల నరకయాతన

## రోడ్డుపైనే కార్ల కడుగుడు.. పట్టించుకోని అధికారులు




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని 22వ వార్డు హరిప్రియ నగర్ పరిధిలో ఉన్న రోడ్ నెంబర్ 8 పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కొందరి బాధ్యతారాహిత్యం.. అధికారుల నిర్లక్ష్యం తోడవ్వడంతో స్థానికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాకాలం కాకపోయినా.. ఎండాకాలంలో కూడా ఈ రోడ్డు నీటితో నిండి బురదమయంగా కనిపిస్తోంది. ప్రతిరోజూ ఉదయం కొంతమంది బోరు పైపులతో ఇళ్ల ముందు వాహనాలను.. ముఖ్యంగా నాలుగు చక్రాల బండ్లను రోడ్డుపైనే కడుగుతున్నారు. దీనివల్ల రోడ్డంతా నీరు నిలిచి.. మట్టితో కలిసిపోయి నడవలేని స్థితికి చేరుతోంది.

### రోడ్డుపైనే ప్రమాదాల పొంచి ఉన్నాయి

మరోవైపు కొంతమంది ఇంటి ముందు గోడలా భావించి రోడ్డు పక్కన మట్టి వేయడంతో సమస్య మరింత జటిలమవుతోంది. ఆ మట్టి నీటితో కలసి బురదగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. గతంలో ఈ బురదలో ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయపడిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఎండాకాలంలోనూ రోడ్ల ఇలా చెరువులను తలపిస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రతిరోజూ కాలనీలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా.. స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి.. రోడ్డుపై వాహనాలు కడగడాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. నీరు బయటకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులకు కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డ్రైనేజీ గుంతలు.. వృద్ధులకు గండాలు!




- బీజేఆర్ చౌరస్తాలో అసంపూర్తి పనులు.. నత్తనడకన మరమ్మతులు
- గ్రిల్స్‌పై ప్రమాదకర ప్రయాణం.. పెన్షనర్ల ప్రాణాలకు ముప్పు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుండి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో.. ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద డ్రైనేజీ మోరి మరమ్మత్తుల పనులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. పనులలో విపరీతమైన ఆలస్యం జరుగుతుండటంతో.. అక్కడికి వచ్చే వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం



కారణంగా ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది.

### పెన్షనర్ల ప్రాణాలతో చెలగాటం

ప్రతిరోజూ పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో వృద్ధులు ఈ కేంద్రానికి వస్తుంటారు. అయితే డ్రైనేజీ పనుల కోసం తవ్విన గుంతను సరిగా మూసివేయకుండా.. కేవలం ఇనుప గ్రిల్స్‌ను అడ్డంగా వేసి పాదచారులను దానిపై నడిపిస్తున్నారు. ఈ పరిస్థితి వృద్ధులకు శరాఘాతంగా మారింది. ఆ గ్రిల్స్‌పై నడవడం ఏమాత్రం సురక్షితం కాకపోవడంతో.. ఎప్పుడైనా జారి లోపల పడే ప్రమాదం పొంచి ఉంది. కాలు.. చేతులు విరగడమే కాకుండా.. ప్రాణాపాయం కూడా తలెత్తే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు మేల్కోవాలి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి.. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. తాత్కాలికంగానైనా సురక్షితమైన దారిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ఈ నిర్లక్ష్యాన్ని వీడి.. తక్షణమే తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డి, కుసుమ కుమార్ నిర్దోషులు!

### ఆరోపణలు రుజువు కాలేదని తేల్చిన ప్రజాప్రతినిధుల కోర్టు

### న్యాయపోరాటంలో నెగ్గిన కాంగ్రెస్ అగ్ర నేతలు

**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):** మానవ అక్రమ రవాణా కేసులో కాంగ్రెస్ ముఖ్య నేతలు జగ్గారెడ్డి.. కుసుమ కుమార్‌లకు పెద్ద ఊరట లభించింది. వారిపై గతంలో నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేస్తూ వారిని నిర్దోషులుగా ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన ఈ కేసులో.. మొదటి నిందితుడు తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి).. మూడో నిందితుడు కుసుమ కుమార్‌పై చేసిన ఆరోపణలు న్యాయస్థానంలో రుజువు కాలేదని కోర్టు స్పష్టం చేసింది.

### న్యాయస్థానంలో వీగిన ఆరోపణలు

ఈ కేసులో భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లతో పాటు భారత పాస్‌పోర్ట్ చట్టం.. ఇమ్మిగ్రేషన్ చట్టం కింద నమోదైన అన్ని అభియోగాల నుండి కోర్టు వారికి విముక్తి కల్పించింది. జగ్గారెడ్డి.. కుసుమ కుమార్ తరపున న్యాయవాది జి. సంతోష్ రెడ్డి తన వాదనలు వినిపించగా.. న్యాయస్థానం గురువారం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా తుది తీర్పును వెలువరించింది. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ చట్టపరమైన వివాదానికి ఈ తీర్పుతో తెరపడినట్లయింది.



# సిద్దిపేటలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

**కుటుంబ పాలనకు స్వస్తి పలకనున్న ప్రజలు: అత్తు ఇమామ్ ధీమా!**

**బీఆర్ఎస్‌పై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు విమర్శల దాడి**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

రాబోయే ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేయడమే తమ ఏకైక లక్ష్యమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ఎన్నికల్లోనే హరీష్ రావు మెజారిటీని గణనీయంగా తగ్గించామని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘనవిజయం సాధించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సిద్దిపేట నుంచి పోటీ చేస్తారనే ప్రచారంపై స్పందిస్తూ.. సమయం వచ్చినప్పుడు పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఇమామ్ తెలిపారు. పదేళ్లుగా కొనసాగుతున్న కుటుంబ పాలనపై ప్రజలు విసుగు చెందారని.. త్వరలోనే వారికి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అసలైన అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజల మనసు గెలుచుకుందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని.. ఆ కారణంగానే గత ఎన్నికల్లో వారికి గుణపాఠం నేర్పారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి గెలిచే కాంగ్రెస్ అభ్యర్థికి మంత్రి పదవి వచ్చే అవకాశం కూడా ఉందని.. మరో పదేళ్ల పాటు రాష్ట్రంలో ప్రజా పాలన సాగేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్యాదరి మధు.. గయాసుద్దీన్.. అర్షద్.. నజ్జు.. విజయ్ డానియల్.. బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ముందస్తు అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతు నొక్కే ప్రయత్నం: ఏఐవైఎఫ్**




**బెజ్జంకి, మార్చి 26 (జనం పవర్):** అక్రమ అరెస్టులతో ప్రభుత్వం నిరుద్యోగ ఉద్యమాలను ఆపలేదని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ యాదవ్ స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించ తలపెట్టిన 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో.. పోలీసులు మహేష్ యాదవ్‌ను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందని మహేష్ యాదవ్ విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్ బహిరంగ సభలో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను విస్మరించడం అన్యాయమని అన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటున్న ఆటలను సహించేది లేదని హెచ్చరించారు. అక్రమ అరెస్టులు.. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మహేష్ యాదవ్ స్పష్టం చేశారు. ముందస్తు అరెస్టుల వల్ల ఉద్యమకారుల్లో పట్టుదల పెరుగుతుందే తప్ప వెనకడుగు వేయబోరని ఆయన పునరుద్ఘాటించారు.

# టీజీఓయూ సంచలన తీర్మానాలు!

**పెండింగ్ డీఏ.. బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్**




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ నేతృత్వంలో పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వేదికగా జరిగింది. జిల్లాలోని గెజిటెడ్ అధికారుల సమస్యలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్.. కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు అత్యంత కీలకమని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాకు చెందిన ఉద్యోగులు తమ నిబద్ధతతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ సమావేశంలో పలు కీలకమైన డిమాండ్లతో కూడిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని.. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటితో పాటు 40 శాతం ఫిట్‌మెంట్ అమలు.. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి ప్రధాన అంశాలపై తమ గళాన్ని వినిపించారు. అలాగే ఆరోగ్య భద్రత పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని.. ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నేతలు కోరారు. కారుణ్య నియామకాలు సత్వరమే పూర్తి చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. కొన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని.. అధికారుల పనితీరు.. ప్రవర్తనలో సానుకూల మార్పులు రావాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని సమావేశం ఆకాంక్షించింది. ప్రభుత్వం.. ఉద్యోగుల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని.. తద్వారా పాలన మరింత పారదర్శకంగా మారుతుందని పేర్కొంటూ సమావేశం ముగిసింది.







# ప్రతిభకు పట్టాభిషేకం

- సెయింట్ ఆంథోనీస్ స్కూల్ సంబరాలు!
- విద్యార్థులకు ఘనంగా అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం
- ఉత్సాహంగా సాగిన చిన్నారుల వార్షిక పురస్కారాల వేడుక

**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):** పుస్తకాల్లోని జ్ఞానంతో పాటు జీవితాన్ని సరైన అవగాహనతో నడిపించేదే అసలైన విద్య అనే సందేశంతో.. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో అచీవ్‌మెంట్ అవార్డుల వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు చేసిన స్వాగత నృత్యంతో ప్రారంభమైన ఈ వేడుక.. జ్యోతి ప్రజ్వలనతో కొనసాగింది.

**విజయం ఒక ప్రయాణం**

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విజయం అనేది ఒక లక్ష్యం మాత్రమే కాదని.. అది ఒక నిరంతర ప్రయాణం అని పేర్కొన్నారు. జీవితంలో గెలుపోటములు సహజమని.. వాటిని సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి రాణించాలని ఆకాంక్షించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డులను అందజేశారు. కేవలం మార్కులే కాకుండా.. సత్ప్రవర్తన.. సమయపాలన.. చేతివ్రాత.. క్రీడలు.. బాధ్యతాయుతంగా పనులు పూర్తి చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. తమ పిల్లలు అవార్డులు అందుకుంటుంటే తల్లిదండ్రులు ఆనందంతో మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ కుమార్ రెడ్డి.. అకాడమిక్ డైరెక్టర్.. ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి.. వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కి శెట్టి.. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ. సాలోమోన్ రెడ్డి పర్యవేక్షణలో.. వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# పన్నులు చెల్లించండి.. ప్రగతికి తోడ్పడండి!

- మార్చి 31లోపు ఇంటి పన్నులు కట్టాలని నిర్మలా జయప్రకాష్ రెడ్డి పిలుపు
- నిర్లక్ష్యం వహిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిక



**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):** సంగారెడ్డి పురపాలక సంఘం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని.. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ ప్రగతికి సహకరించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాష్ రెడ్డి కోరారు. పట్టణ పరిధిలోని గృహ.. వాణిజ్య భవనాల యజమానులు తమ బాధ్యతగా పన్నులు చెల్లించాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కమిషనర్‌తో నిర్వహించిన సమావేశంలో పట్టణాభివృద్ధి పనులపై ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

**మార్చి 31 ఆఖరు గడువు**

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి 31లోపు ప్రజలందరూ తమ పన్ను బకాయిలను చెల్లించాలని సూచించారు. గడువు దాటితే పెనాల్టీ రూపంలో అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధి పనులకు నిధుల లభ్యత పెరగాలంటే పన్నుల చెల్లింపు ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఆమె తన ఇంటి పన్నుకు సంబంధించిన రుసుమును స్వయంగా కమిషనర్‌కు అందజేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అధికారులు.. ప్రజాప్రతినిధులు కూడా పన్నుల చెల్లింపులో ముందుండాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మెట్రోను సంగారెడ్డి దాకా పొడిగించండి!

- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- నత్తనడకన సాగుతున్న రహదారి పనులపై ఆగ్రహం



**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన నియోజకవర్గ ప్రజల సమస్యలపై గళమెత్తారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో రవాణా సౌకర్యాల లోపం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మెట్రో రైలు విస్తరణ.. రహదారి పనుల ఆలస్యంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

**మెట్రో విస్తరణ అత్యవసరం**

గతంలో మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టును కేవలం ఇస్నాపూర్‌తో ఆపకుండా సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్.. జహీరాబాద్.. అందోల్ వంటి పరిసర ప్రాంతాల ప్రజలు ఉపాధి.. విద్య.. వ్యాపారాల కోసం పెద్ద ఎత్తున సంగారెడ్డికి వలస వస్తున్నారని వివరించారు. వీరంతా ప్రతిరోజూ హైదరాబాద్‌కు ప్రయాణించాల్సి వస్తోందని.. సరైన ప్రజా రవాణా లేక ఆర్థికంగా.. శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే సాంకేతిక రంగం.. పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుందని అభిప్రాయపడ్డారు.

**రహదారి పనులపై ఆగ్రహం**

మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులు 2026 నాటికి పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. పనుల ఆలస్యం కారణంగా వాహనదారులు నిత్యం ట్రాఫిక్ నరకాన్ని చూస్తున్నారని తెలిపారు. ఉదయం.. సాయంత్రం వేళల్లో విద్యార్థులు.. ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు సమయానికి చేరుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పనులను వేగవంతం చేయాలని.. నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడీకి పంపండి..

**గ్రామంలో ఘనంగా బాలమేళా కార్యక్రమం**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

గ్రామంలో బాలమేళా కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామ సర్పంచ్.. వార్డు సభ్యులు.. వి.ఓ నాయకులు.. ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వరూప.. రిలయన్స్.. క్రై సంస్థల ప్రతినిధులు సరిత.. రజితలతో పాటు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యారు. చిన్నారుల సమగ్ర వికాసంపై ఈ సందర్భంగా పలువురు ప్రసంగించారు. సర్పంచ్ మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యం.. విద్యాభివృద్ధికి ఇది ఎంతో కీలకమని ఆయన వివరించారు. అంగన్‌వాడీల్లో లభించే పోషకాహారం.. ప్రాథమిక విద్య పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలమాకుల అంగన్‌వాడీ టీచర్లు రెహనా బేగం.. నరసవ్వ.. రజిత చురుగ్గా పాల్గొన్నారు. పిల్లల పోషణ.. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో అంగన్‌వాడీల పాత్రను వారు వివరించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరుతూ కార్యక్రమం ముగిసింది.



# హక్కుల కోసం విద్యుత్ కార్మికుల గర్జన!

- సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ 8 నుంచి సమ్మె
- సిద్దిపేటలో ఆర్టిసన్ ఉద్యోగుల భారీ ధర్నా



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో డివిజన్ కార్యాలయం ముందు గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి పలు కార్మిక సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. తమ గోడును వినాలని.. హక్కులను కాపాడాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఆర్టిసన్ కార్మికులందరికీ ఏపీ ఎస్ఈబీ నిబంధనలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ వర్కర్లను తక్షణమే విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని.. అన్‌మ్యాన్ వర్కర్ల ఉద్యోగాలకు భద్రతతో కూడిన స్థిరత్వం కల్పించాలని గట్టిగా కోరారు. అలాగే పీస్ రేట్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం నెలకు 30 రోజుల పని చూపిస్తూ.. సరైన వేతనం అందజేయాలని వారు విన్నవించారు.

### ఏప్రిల్ 8 నుంచి సమ్మె బాట

గత ప్రభుత్వం కార్మికులను సంస్థలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని.. దీనివల్ల వేల కుటుంబాలు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని.. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తమను గుర్తించి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావాలని కోరారు. యాజమాన్యం తమ సమస్యలపై తక్షణమే స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 8 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు.. జేఏసీ నాయకులు.. మహిళా ఉద్యోగులు.. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# బీసీ సబ్ ప్లాన్ కోసం బీఆర్ఎస్ గర్జన

- గన్ పార్క్ వద్ద ఎమ్మెల్యేల నిరసన!
- బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- ధర్నాలో పాల్గొన్న హరీష్ రావు.. చింత ప్రభాకర్




**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):**

హైదరాబాద్‌లోని గన్ పార్క్ సాక్షిగా బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ గురువారం ధర్నాకు దిగారు. బీసీల హక్కుల కోసం.. వారి సంక్షేమం కోసం వెనకడుగు వేసేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి.. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు.. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ సబ్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని.. బీసీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ వాగ్దానాలను తుంగలో తొక్కిందని వారు విమర్శించారు. బీసీలను మోసం చేసిన ఈ ప్రభుత్వం వెంటనే తన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. గన్ పార్క్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా ప్రకటించారు.

# పారిశుద్ధ్యానికి 'ప్రగతి' బాట

**చెత్త సేకరణ.. కాలువల శుభ్రతపై ప్రత్యేక నిఘా:అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తెలిపారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ డివిజన్లో పర్యటించిన ఆయన.. అభివృద్ధి పనుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేయర్ ధర్ని మధుకర్.. కమిషనర్ అన్వేష్‌తో కలిసి కాలనీల్లో కలియతిరుగుతూ పారిశుద్ధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### ఇంటింటికీ చెత్త సేకరణ

మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి రోజూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అంతర్గత రహదారులు.. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అధికారులకు సూచించారు. తొంభై తొమ్మిది రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు.

### ఇందిరమ్మ ఇళ్లపై పర్యవేక్షణ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనలకు లోబడి త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని చంద్రయ్య తెలిపారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేలా చూడాలని.. పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ పనుల్లో లబ్ధిదారులకు ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### ప్రజా సమస్యల పరిష్కారం

పర్యటనలో భాగంగా పట్టణ ఆరోగ్య ఉప కేంద్రంలో నెలకొన్న సమస్యలు.. ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలతో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై తక్షణమే స్పందించిన అదనపు కలెక్టర్.. సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు.. వీధి దీపాలు.. మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు.. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఢిల్లీ యోగా పోటీలకు సిద్దిపేట ఆణిముత్యాలు!

**జాతీయ అస్మిత పోటీల్లో సత్తా చాటనున్న యువతులు**

**తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మనీషా.. పూజిత.. ప్రసన్న**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

న్యూఢిల్లీలోని ఆనంద్ ధామ్ ఆశ్రమంలో మార్చి 29 నుంచి 31 వరకు జాతీయ స్థాయి అస్మిత యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున సిద్దిపేట జిల్లాకు చెందిన యోగ క్రీడాకారులు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. రిథమిక్ పెయిర్ విభాగంలో సిద్దిపేటకు చెందిన ఏ. మనీషా.. జి. పూజిత ఎంపికయ్యారు. అలాగే ట్రెడిషనల్ గ్రూప్ విభాగంలో ఏ. మనీషా.. బి. ప్రసన్నలు చోటు దక్కించుకున్నారు.

### సౌత్ జోన్ విజేతలుగా గుర్తింపు

వీరు గతంలో హైదరాబాద్‌లో జరిగిన సౌత్ జోన్ యోగాసన పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు గెలుచుకున్నారు. ఆ ఘన విజయాల ఫలితంగానే ఇప్పుడు జాతీయ స్థాయి అస్మిత యోగా పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం వీరికి ప్రత్యేకంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యులు.. వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏ. అరవింద్ కుమార్ క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరచి సిద్దిపేట జిల్లాకు.. తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్.. ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి.. ఉపాధ్యక్షుడు హరిప్రసాద్.. యోగా శిక్షకులు తోట సతీష్.. సంధ్య తదితరులు పాల్గొన్నారు.



# బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్ పటేల్

**వరుసగా నాలుగోసారి ఏకగ్రీవ ఎన్నిక..తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు**



**జుక్కల్, మార్చి 26 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా బిచ్కుందలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు గురువారం రోజున రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నాలుగోసారి ఏ. ప్రకాష్ పటేల్ ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో నాలుగోసారి కూడా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఆయన సభ్యుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షులుగా ఈ. శివాజీ.. జనరల్ సెక్రటరీగా ఆర్. మనోజ్ కుమార్.. సభ్యులుగా లక్ష్మణ్ రావు.. మల్లేశ్వర్.. విట్టల్ రావు.. విట్టల్.. పురుషోత్తం.. సుధాకర్ పటేల్.. రవి పటేల్.. శంకర్ రావు పటేల్ తదితరులు ఉన్నారు.

# బైక్ దొంగ అరెస్ట్

**నిందితుడి నుంచి వాహనం స్వాధీనం!**

**జుక్కల్, మార్చి 26 (జనం పవర్):** ఈ నెల 23వ తేదీన బిచ్కుంద మండల సీతారాంపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల గంగబోయి తన హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌ను బిచ్కుందలోని పరమేశ్వర సినిమా థియేటర్ వద్ద నిలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ వాహనాన్ని దొంగిలించడంతో బాధితుడు బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి ఆదేశాల మేరకు.. బిచ్కుంద సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ రాజు నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. సీసీ కెమెరాల దృశ్యాలు.. శాస్త్రీయ.. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం బిచ్కుంద బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను బిచ్కుంద మండల రాజుల గ్రామానికి చెందిన చౌహాన్ అర్జున్ అని గుర్తించారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. దొంగిలించిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్జున్ గతాన్ని ఆరా తీయగా.. బిచ్కుంద పరిధిలోని కందర్‌పల్లి.. ఫత్లాపూర్ హనుమాన్ దేవాలయాల్లో జరిగిన మూడు దొంగతనాలతో పాటు బాన్సువాడ.. జుక్కల్.. నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాల్లో ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అత్యంత చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న బిచ్కుంద ఎస్ఐ రాజు.. కానిస్టేబుళ్లు నదీమ్.. ఉపేంద్రలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించి వాహనాన్ని రికవరీ చేయడం పట్ల ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# మహిళా వేడుకలకు ప్రముఖుల ఆహ్వానం!

**ఈ నెల 29న వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో సంబరాలు**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ.. జగ్గారెడ్డిలకు ఆహ్వాన పత్రాల అందజేత**





**సంగారెడ్డి, మార్చి 26 (జనం పవర్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న వేడుకలకు ప్రముఖులను ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలను ఏకం చేస్తూ నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. టీపీసీసీ కార్యదర్శి జగ్గారెడ్డి.. టీజీఏసీ చైర్మన్ నిర్మల రెడ్డిలను జిల్లా మహిళా సమాజం ప్రతినిధులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పెద్దల సమక్షంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాజం అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ.. ప్రధాన కార్యదర్శి గౌర్రెగట్టు శారద.. యూత్ ప్రధాన కార్యదర్శి నవీన్ రామోజి పాల్గొని ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. మహిళల సాధికారత.. సామాజిక అభివృద్ధిలో వారి పాత్రను చర్చించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.



# పెద్ద తడ్గూరు సర్పంచ్‌కు ఘన సన్మానం!

**రవీంద్ర భారతిలో శాంతవ్వ ఈరన్నకు సత్కారం**

**రజక సామాజిక వర్గ నేతల ఆత్మీయ అభినందన సభ**



**జుక్కల్, మార్చి 26 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన రజక సామాజిక వర్గ ప్రతినిధులకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఆత్మీయ అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూరు గ్రామ సర్పంచ్ శాంతవ్వ ఈరన్నను ప్రత్యేకంగా సన్మానించారు. సర్పంచ్ ఫోటోతో కూడిన జ్ఞాపికను ఆమెకు అందజేశారు. రజక చాకలి సర్పంచులుగా ఎన్నికైన వారిలో పెద్ద తడగూర్ సర్పంచ్ గా శాంతవ్వ ఈరన్న గెలుపొంది సరికొత్త రికార్డు సృష్టించారు. రవీంద్ర భారతిలో బీసీ టైమ్స్.. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో సన్మానం పొందిన సందర్భంగా.. ఈ కార్యక్రమ నిర్వాహకులందరికీ సర్పంచ్ శాంతవ్వ ఈరన్న ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకముంచిన ప్రజలకు.. సహకరించిన వారందరికీ ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

# పెద్ద ఎక్లరాలో నూతన బోరు!

**వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా సర్పంచ్ చొరవ**

**సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తుల హర్షం**



**జుక్కల్, మార్చి 26 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పరిధిలోని మద్నూర్ మండలం పెద్ద ఎకలార గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నీటి కొరత రాకుండా సర్పంచ్ సోమవార్ మహేష్ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప సర్పంచ్ ముంగ్దేవార్ సంగ్రామ్ పటేల్‌తో కలిసి గురువారం నూతనంగా బోరు వేయించి నీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండాకాలంలో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. నూతన బోరు ద్వారా గ్రామ ప్రజలందరికీ పుష్కలంగా నీటిని అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ నీటి కష్టాలను తీర్చినందుకు గ్రామ ప్రజలు సర్పంచ్ మహేష్‌కు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముగ్దేవార్ బస్వంత్ రావ్ పటేల్.. వాలంకే ప్రహ్లాద్.. హన్మంత్ రావు దేశాయ్.. నిలవర్ మాధవరావు.. మాదాయప్ప స్వామి.. ములేవార్ అశోక్.. కాంగ్రెస్ నాయకులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపనపల్లిలో అంగన్‌వాడీల తనిఖీ

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి!**

**హాజరు వివరాలు.. రికార్డులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్**

**మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని ఉపాధ్యాయులకు హెచ్చరిక**

**జుక్కల్, మార్చి 26 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని గోపనపల్లిలో గల అంగన్‌వాడీ కేంద్రం.. ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ సీమ రమేష్ శెట్కార్.. కౌన్సిలర్ కార్తీక సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను రికార్డుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

**మెనూ ప్రకారం భోజనం**

విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని.. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం వడ్డించాలని పాఠశాల ప్రిన్సిపాల్ వినీత.. ఉపాధ్యాయులు చాంద్ పాషా.. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మిని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం.. విద్యా విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.

**సమస్యల పరిష్కారానికి హామీ**

గోపనపల్లి కౌన్సిలర్ మారుతి పటేల్.. స్థానిక గ్రామస్తులు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ సీమ శెట్కార్ దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ సావధానంగా విన్న చైర్మన్.. త్వరలోనే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి ప్రగతికి సమిష్టి బాట

- కలెక్టర్ కుమార్ దీపక్
- మున్సిపల్ బడ్జెట్ 32.42 కోట్లకు కౌన్సిల్ ఆమోదం
- ఏడాదిలో మురికివాడల రూపురేఖలు మారుస్తామన్న ఎమ్మెల్యే వినోద్



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య.. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్.. సబ్ కలెక్టర్ మనోజ్.. మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి.. వైస్ చైర్‌పర్సన్ సత్యనారాయణ.. కమిషనర్ సంపత్ పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బందికి సకాలంలో వేతనాలు అందేలా చూడాలని.. ఇందుకు గాను ఇంటి పన్నుతో పాటు ఇతర పన్నులను వంద శాతం వసూలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధికి నిధుల వరద**

పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడానికి డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా ఆటోలు సమకూర్చినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం సీఎస్‌ఆర్ నిధుల నుంచి 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని అంతర్గత రహదారులు.. మురుగు కాలువల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ ఖర్చులు తగ్గించేందుకు సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నందున.. ముల్కల్ల నుంచి నీటిని మళ్లించి ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆదాయ వనరులపై దృష్టి**

వార్డుల్లో సిబ్బంది కొరత ఉంటే పాలకవర్గం సమన్వయంతో భర్తీ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలో ఉన్న దుకాణాల అద్దెను క్రమం తప్పకుండా వసూలు చేయాలని.. ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. 2026-27 సంవత్సరానికి గాను 32 కోట్ల 42 లక్షల రూపాయల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని.. ఇందులో గ్రాంట్ల రూపంలో 26 కోట్ల 28 లక్షలు.. సాధారణ ఆదాయం 4 కోట్ల 77 లక్షలు.. డిపాజిట్లు 81 లక్షలు.. నిల్వ నిధులు 55 లక్షలు ఉన్నాయని వివరించారు.

**ఏడాదిలో మురికివాడల అభివృద్ధి**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 34 వార్డుల్లో ఉన్న మురికివాడలను ఏడాది కాలంలో పూర్తిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పారిశుద్ధ్యం.. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ.. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గ సభ్యులు జవాబుతారీతనంతో వ్యవహరించాలని కోరారు. బడ్జెట్ కేటాయింపుల ప్రకారం నిధులను పారదర్శకంగా వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు.. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిద్దిపేట బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా రమేష్ బాబు!

- హోరాహోరీ పోరులో 10 ఓట్ల మెజారిటీతో గెలుపు
- రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్న న్యాయవాదులు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట బార్ కౌన్సిల్ ఎన్నికలు గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 205 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 203 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. న్యాయవాదులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు.

**రమేష్ బాబుకు పట్టం**

అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో రమేష్ బాబు 106 ఓట్లు సాధించి ఘన విజయం అందుకున్నారు. ఆయన ప్రత్యర్థి.. మాజీ అధ్యక్షుడు సి.హెచ్. జనార్దన్ రెడ్డికి 96 ఓట్లు వచ్చాయి. దీంతో రమేష్ బాబు 10 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజేతగా నిలిచారు. ప్రధాన కార్యదర్శిగా సదానందం ఎన్నికయ్యారు.

**ప్యానెల్ సభ్యుల వివరాలు**

అధ్యక్షుడిగా గెలిచిన రమేష్ బాబు ప్యానెల్‌లో పిన్న రాములు.. శివాజీ.. జి. రామకృష్ణ.. మణి.. వెంకన్న.. మహేష్ తదితరులు సభ్యులుగా విజయం సాధించారు. నూతన కార్యవర్గానికి తోటి న్యాయవాదులు.. మిత్రులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా విజేతలు పేర్కొన్నారు.

# పల్లెల ప్రగతే లక్ష్యం.. ప్రజా పాలనపై ఎంపీఓ తనిఖీ!

**పారిశుద్ధ్య పనులు.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆరా**

**మండలంలో వంద శాతం పన్ను వసూళ్లు చేయాలని ఆదేశం**



**జైపూర్, మార్చి 26 (జనం పవర్):** జైపూర్ గ్రామ పంచాయతీలో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మండల పరిషత్ అధికారి శ్రీపతి బాపు రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**డ్రైనేజీ సమస్యల పరిష్కారం**

అనంతరం పెగడపల్లి శివారులో చెత్తతో నిండి ఉన్న మురుగు కాలువలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. కాలువ చివరన ఇంకుడు గుంతల ఏర్పాటుకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**వంద శాతం పన్ను వసూళ్లు**

జైపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వంద శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీఓ ఆదేశించారు. ముఖ్యంగా పెగడపల్లి.. జైపూర్ పంచాయతీ కార్యదర్శులు ఈ విషయంలో వేగంగా స్పందించాలని సూచించారు. ఈ పర్యటనలో జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్.. పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము.. కార్యదర్శులు ఉదయ్ కుమార్.. శ్రీవాణి.. సిబ్బంది పాల్గొన్నారు.

# భీమారం పోలీస్ స్టేషన్‌లో డీసీపీ తనిఖీ

**పెండింగ్ కేసులపై ఆరా!**

**డయల్ 100 ఫిర్యాదులపై సత్వర స్పందన ఉండాలని ఆదేశం**

**మారుమూల గ్రామాల్లో నిరంతర నిఘాకు డీసీపీ దిశానిర్దేశం**

**భీమారం, మార్చి 26 (జనం పవర్):** మంచిర్యాల డీసీపీ భాస్కర్.. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్.. సీఐ నవీన్‌లతో కలిసి భీమారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ భౌగోళిక పరిస్థితులు.. సిబ్బంది పనితీరు.. పరిధిలో అధికంగా నమోదయ్యే కేసుల వివరాలతో పాటు గ్రామాల సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులను అత్యంత వేగంగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

**రికార్డుల పరిశీలన.. సిబ్బందితో చర్చ**

డీసీపీ భాస్కర్ రిసెప్షన్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి ఎస్ఐ రాజేందర్ నుంచి వివరాలు సేకరించారు. కేసుల విచారణలో ఎక్కడా జాప్యం లేకుండా చూసుకోవాలని.. బాధితులకు తక్షణ న్యాయం అందేలా కృషి చేయాలని సూచించారు.

**ప్రజల్లోకి పోలీస్ వ్యవస్థ**

ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను నిరంతరం సందర్శించాలని.. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల్లో భరోసా కల్పించేలా పోలీసుల పనితీరు ఉండాలని.. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నేరస్తుల పట్ల కఠినంగా ఉంటూనే.. సామాన్య ప్రజలకు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.



